# 14

# వెనుకకు - మరియు ముందుకు చూడడం

## (8:1-7)

యేసుని యాజకత్వపు శ్రేష్ఠత్వమును గురించి గ్రంథకర్త చర్చ ప్రముఖ భాగమునకు మనము వచ్చాము. 5 నుండి 7 అధ్యాయములలో క్రైస్తవ ప్రధాన యాజకుడు అయిన యేసుని గురించి మనం నేర్చుకున్నాము. 9 మరియు 10 అధ్యాయములలో క్రైస్తవ ప్రధాన యాజకత్వపు సేవను గురించి గ్రంథకర్త చర్చిస్తున్నాడు. 8వ అధ్యాయం సంధాన అధ్యాయం. మునుపటి అంశమును చూసి దానిని ముగిస్తుంది. అలాగే ముందుకు చూసి రెండవ అంశమును పరిచయం చేస్తుంది.

### వెనుకకు చూడడం (8:1)

మీరు ప్రతిరోజు రాత్రి కొంతమంది కొంతకాలం పాటు ఒక అంశమును గురించి బోధిస్తున్నారనుకుందాము. ప్రతి రాత్రి ఇంతకు ముందు చెప్పిన విషయ సారాంశమును జ్ఞాపకం చేస్తూ మీరు ప్రారంభిస్తారు: "మనము కథలో ఇక్కడ ఉన్నాము" అలాగే హెబ్రీ గ్రంథకర్త కూడ 8వ అధ్యాయమును ప్రారంభిస్తున్నాడు. "మేము ఇప్పటి వరకు చెప్పిన సంగతుల *సారాంశము ఇదే*" అని KJVలో వ్రాయబడింది (నొక్కి చెప్పింది నాది).

యేసు ఏవిధంగా గొప్ప ప్రధాన యాజకుడు అన్న వాదన వివరణను గ్రంథకర్త 7వ అధ్యాయములో ఇస్తున్నాడు. ఇవన్నీ కూడ "మనకు ఇట్టి ప్రధాన యాజకుడు ఉన్నాడు" అనే 8:1 వాక్యములోని "ఇట్టి" లో చెప్పబడ్డాయి. అంటే 7వ అధ్యాయములో చెప్పబడినటువంటి ప్రధానయాజకుడు మనకున్నాడు. 8వ అధ్యాయం ప్రారంభంలో తన వాదనలను ముగింపునకు తీసుకువస్తున్నాడు. యేసు గొప్ప ప్రధానయాజకుడు ఎందుకంటే (1) ఆయన రాజరిక ప్రధానయాజకుడు మరియు (2) ఆయన పరలోకంలో పరిచర్య చేస్తున్నాడు.

మనకు సంబంధించి, 1 వచనంలో ప్రాముఖ్యమైన పదం "కలిగియుండడం" అనేది: మనము అట్టి ప్రధానయాజకుడిని కలిగియున్నాము. యూదులకు ప్రధాన యాజకులున్నారు. క్రీ.శ. 70లో యెరూషలేము నాశనం చేయబడేంతవరకు వారికి ప్రధాన యాజకులు ఉంటూనే వచ్చారు. కానీ మనకు ఒక ప్రధాన యాజకుడున్నాడు (వర్తమానకాలం). మనకు నిరంతరము ఆ ప్రధాన యాజకుడుంటాడు. కాబట్టి దేవుని సమీపించుటకు మనకు అవకాశం ఉంది.[1]

### ముందుకు చూడడం (8:2-7)

#### ప్రత్యక్ష గుడారము (8:2-6ఎ)

2వ వచనమును ప్రారంభిస్తూనే క్రైస్తవులకు గొప్ప గుడారము ఉందని గ్రంథకర్త చెప్తున్నాడు. అతని భావన ధోరణి యిలా సాగింది:

(1) ప్రధాన యాజకుడు బలిని అర్పించుటకు ఒక అర్పణ మరియు దాని నిమిత్తం ఒక

స్థలం కావాలి (3 వ.). యేసు అర్పించిన ఆ అర్పణ 7:27లో చెప్పబడింది. దాని గురించి తరువాత నేర్చుకుందాము. ఈ వాక్య భాగంలో అర్పించబడిన *స్థలం* గురించి గ్రంథకర్త వివరిస్తున్నాడు.

(2) యేసు ఈ అర్పణను భూమిపై అర్పించలేదు. దీనికి రెండు కారణాలున్నాయి. ఆయన ఈ లోకమునకు సంబంధించిన వాడు కాదు (1 వ.), మరియు ఈ లోకంలో అదివరకే యాజకులు పరిచర్య చేస్తు ఉన్నారు (4 వ.).

(3) ఆయన పరలోకంలోనే తన పరిచర్యను చేయగలడు. ఎందుకంటే, ఆయన గుడారము అక్కడే ఉంది (1, 2 వచనాలు).

(4) పరలోకపు గుడారము మోషే నిర్మించిన గుడారము (ప్రత్యక్ష గుడారము[2]) కంటే, మిక్కిలి గొప్పది. దీనికి అనేక కారణాలున్నాయి:

- గుడారమును నిర్మించుటలో ఎన్నో శ్రమలు, కష్టాలు ఉన్నాగాని, మోషే నిర్మించిన గుడారము ఒక సాదృశ్యము, నీడవంటిది (5 వ.).
- అంతేగాకుండా, ఈ గుడారములో అర్పించబడిన బలులు, నిజమైన వాటితో పోల్చితే, ఒక ఛాయ వంటిది (4, 5ఎ వచనాలు).
- *నిజమైన* ప్రత్యక్షగుడారము – పరలోకంలో దేవుడు నిర్మించినది (2 వ.).

(5) పరలోకపు గుడారము ఈ లోకపు గుడారము కంటే గొప్పదని చెప్పుటకు గల ముఖ్య కారణం గొప్ప ప్రధానయాజకుడు అక్కడ పరిచర్య చేస్తున్నాడు (2 వ.).[3] "పరిచర్య" అనే ఈ పదము మామూలు పదం వంటిది కాదు. ఒకరి సొంత ఖర్చులతో ఇతరుల కోసం పనిచేయడం అన్న అర్థాన్ని ఈ పదం ఇస్తుంది.[4] ఇతరులు పరిచర్య చేశారు కానీ, యేసు "మరి *శ్రేష్ఠమైన సేవకత్వము పొందియున్నాడు*" (6 వ.; నొక్కి చెప్పింది నాది).

**నిబంధన (8:6, 7)**

యేసును శ్రేష్ఠమైన ప్రధానయాజకునిగా చూపించడం గ్రంథకర్త ప్రాథమిక ఉద్దేశం అయినను, శ్రేష్ఠమైన అర్పణ, శ్రేష్ఠమైన నిబంధన వంటి ఇతర అంశాలను కూడ చెప్తూ వచ్చాడు. ఇవన్నీ కూడ యేసు గొప్ప ప్రధానయాజకుడు అన్న సత్యమునకు సంబంధించినవే.

- ఒకవేళ యేసు గొప్ప ప్రధాన యాజకుడయితే, ఆయన *గొప్ప బలిని అర్పించాలి* – అవును: ఆయన తన్నుతానే అర్పించుకున్నాడు.
- ఒకవేళ యేసు గొప్ప ప్రధాన యాజకుడు అయితే, ఆయనకు బలి అర్పించుటకు *గొప్ప స్థలం ఉండాలి* – అవును: ఆయన పరలోకంలోని గుడారములో పరిచర్య చేస్తున్నాడు.
- ఒకవేళ యేసు గొప్ప ప్రధానయాజకుడు అయితే, ఆయన *గొప్ప నిబంధనను* కలిగియుండాలి – అవును: పాత నిబంధన అనగా యూదుల నిబంధన లేవీ యాజకత్వముతో ముడిపడియుండగా, యేసు క్షమాపణను అందించు క్రొత్త నిబంధనను అందిస్తున్నాడు.

శ్రేష్ఠమైన నిబంధన అను అంశం 8వ అధ్యాయం చివరి భాగంలో కనబడుతుంది. "యేసు మరి *శ్రేష్ఠమైన నిబంధనకు* పూటకాపాయెను" అన్న విషయమును ఇదివరకటి అధ్యాయములో చూశాము (7:22; నొక్కి చెప్పింది నాది). 8 అధ్యాయములో యిలా అంటున్నాడు,

> ఈయనయైతే ఇప్పుడు మరియెక్కువైన వాగ్దానములనుబట్టి నియమించబడిన *మరి యెక్కువైన నిబంధనకు* మధ్యవర్తియైయున్నాడు గనుక మరి శ్రేష్ఠమైన సేవకత్వము పొందియున్నాడు. ఏలయనగా ఆ మొదటి నిబంధన లోపము లేనిదైతే రెండవదానికి అవకాశముండనేరదు (8:6, 7; నొక్కి చెప్పింది నాది).

యేసుని నిబంధన గొప్పదని గ్రంథకర్త ఎలా చెప్తున్నాడు?

(1) *ఎందుకంటే యేసు దానికి మధ్యవర్తి* (6ఎ వ.). గ్రంథకర్త తిరిగి యేసు దగ్గరికే వస్తున్నాడు. పాత నిబంధనలో అయితే ప్రజలకు మరియు దేవునికి మధ్య బలహీనతగల ప్రధానయాజకుడు నిలిచేవాడు. కానీ క్రొత్త నిబంధనలో మనకు, దేవునికి మధ్య పరిపూర్ణుడైన ప్రధాన యాజకుడు మధ్యవర్తిగానున్నాడు (1 తిమోతి 2:5).

(2) *ఎందుకంటే క్రొత్త నిబంధనలో గొప్ప వాగ్దానములున్నాయి* (6బి వ.). మన పాపముల పరిపూర్ణ క్షమాపణవంటి అనేక "గొప్ప వాగ్దానాలు" నా మస్సులో మెదలుతున్నాయి.[5] ఇందులోని కొన్ని గొప్ప వాగ్దానములు 8వ అధ్యాయం చివరి భాగంలో ఇయ్యబడ్డాయి.

(3) *ఎందుకంటే, మొదటి నిబంధన పూర్తి చేయలేనిది క్రొత్త నిబంధన పూర్తి చేసింది.* 7వ వచనంలోని "లోపములేనిది" అన్న పదం మీకు ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. పాత నిబంధన లోపముగలది అని గ్రంథకర్త చెప్తున్నాడా? చదవండి. "అయితే ఆయన ఆక్షేపించి *వారితో* ఈలాగు చెప్పుచున్నాడు ..." (నొక్కి చెప్పింది నాది) అన్న మాటలతో 8వ వచనం ప్రారంభమవుతుంది. లోపము నిబంధనకు కాదు ప్రజలలోనే ఉంది. 9వ వచనాన్ని గమనించండి: "... వారు నా నిబంధనలో నిలువలేదు." నిబంధనకు లోబడి ప్రజలు జీవించలేదు.

క్రొత్త నిబంధన గొప్పదయిన పత్రికను చదువువారు సందేహపడరాదని గ్రంథకర్త ఊహించాడు. మొదటి నిబంధన ఒక్కటే దేవుడు తన ప్రజలతో చేసుకున్న ఆఖరి నిబంధన కాదని పాత నిబంధనలోనే చెప్పబడిందని గ్రంథకర్త యిర్మీయా 31:31-34 వాక్య భాగమును ఇక్కడ ఉదహరిస్తున్నాడు. ఈ సత్యమును గురించి మనం మరో పాఠములో చూద్దాము. ప్రస్తుతానికి, దీని సారాంశమును చూడండి - యేసు ఇచ్చిన గొప్ప నిబంధన మన హృదయములకు నిశ్చయతనిస్తుంది.[6]

| క్రైస్తవ్యం ఎందుకు శ్రేష్ఠమైనది | |
|---|---|
| **మనకు ఏం ఉన్నది** | **ఏం యిస్తుంది** |
| **గొప్ప ప్రధాన యాజకుడు** | **దేవుని సమీపించే అవకాశం** |
| **శ్రేష్ఠమైన గుడారము** | **యేసు మన పరిచారకుడు** |
| **శ్రేష్ఠమైన నిబంధన ఇది** | **మన హృదయములకు నిశ్చయత** |

మనకు గొప్ప ప్రధాన యాజకుడు, శ్రేష్ఠమైన గుడారము, శ్రేష్ఠమైన నిబంధన ఉన్నాయి. 3వ వచనంలో చెప్పబడిన ప్రకారం, మనకు గొప్ప బలి అర్పణ కూడ ఉంది; అలాగే మనకున్న గొప్ప వాగ్దానముల గురించి ఎంతో చెప్పవచ్చు (6 వ.). "నూతన నిబంధన" మన తరువాత పాఠములో 8వ అధ్యాయమును గురించిన మన అధ్యయనమును కొనసాగించుదాము.

---

సూచనలు

[1]"క్రైస్తవ్యం ఎందుకు శ్రేష్ఠమైనది" అన్న పట్టికను చూడండి. [2]9వ అధ్యాయంలో ప్రత్యక్షగుడారము గురించి చర్చించబడుతుంది. ఈ పుస్తకంలో కనబడే ప్రత్యక్ష గుడారం యొక్క చిత్రమును చూడండి. [3]"క్రైస్తవ్యం ఎందుకు శ్రేష్ఠమైనది" అన్న పట్టికను చూడండి. [4]Neil R. Lightfoot, *Jesus Christ Today* (Grand Rapids, Mich.: Baker Book House, 1976), 154. [5]క్రొత్త నిబంధనలోని "గొప్ప వాగ్దానములు" ఏవి? అన్న ప్రశ్నను గురించి తరగతిలో చర్చించండి. [6]మరలా చార్టును చూడండి.